# ప్రపంచ ఆర్థిక సంక్షోభం... కారణాలు.. పరిణామాలు

**ఆర్థిక కార్యకలాపాల్లో మందగమనం దీర్ఘకాలం సంభవిస్తే.. దాన్నే ఆర్థిక మాంద్యం అంటారు. మాంద్యం సమయంలో బిజినెస్ సైకిల్‌లో సంకోచం సంభవిస్తుంది. తాజాగా అమెరికాలో సబ్‌ప్రైమ్ లెండింగ్ సమస్య... ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ఓ కుదుపు కుదిపింది. గొప్పగొప్ప బ్యాంకులు కుప్పకూలాయి. మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతినడానికి.. అమెరికా బ్యాంకులు విచ్చలవిడిగా రుణాలివ్వడంతో పాటు... ఫైనాన్షియల్ పత్రాల అతి వినియోగమే కారణం. 1930 తర్వాత ఇదే అత్యంత తీవ్ర ఆర్థిక సంక్షోభంగా ప్రపంచబ్యాంకు చీఫ్ ఎకనమిస్ట్ జస్టిన్ లిన్ అభిప్రాయపడ్డారు!!**

ఏదైనా ఆర్థిక వ్యవస్థలో కొన్ని నెలలపాటు.. ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పడిపోవడమే ఆర్థిక మాంద్యమని అమెరికాకు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్ రీసెర్చ్ పేర్కొంది. ఉద్యోగావకాశాలు సన్నగిల్లడం.. పెట్టుబడుల్లో క్షీణత.. కంపెనీల లాభాలు పడిపోవడం వంటి ఆర్థిక తిరోగమన చర్యలు ఏకకాలంలో సంభవించడాన్నే ఆర్థికమాంద్యం అంటారు.

### డిప్రెషన్:

ఒక నిర్ణీత కాలావధిలో ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా మందగించడాన్ని ''డిప్రెషన్'' అని పేర్కొంటారు. డిప్రెషన్ కాలంలో నిరుద్యోగం, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు మందగించడం, ధరలు పడిపోవడం సర్వసాధారణంగా జరుగుతుంది.

### ప్రతిద్రవ్యోల్బణం (Deflation):

- ద్రవ్యోల్బణానికి పూర్తిగా వ్యతిరేకం ప్రతి ద్రవ్యోల్బణం.
- ఒకనిర్ణీత సమయంలో గతేడాది ధరలతో పోలిస్తే ఈ సంవత్సరం అదే సమయంలో ధరలు తక్కువగా ఉన్నప్పుడు ప్రతి ద్రవ్యోల్బణం సంభవిస్తుంది.
- సరాసరి డిమాండ్ పడిపోవడం వల్ల ధరల స్థాయిలో క్షీణతే ప్రతి ద్రవ్యోల్బణం.
- ప్రతి ద్రవ్యోల్బణం ఆర్థిక వ్యవస్థలో తిరోగమనానికి, ఆర్థిక మాంద్యానికి దారితీస్తుంది.
- 1930ల నాటి మహామాంద్యం, 1990లో జపాన్‌లో సంభవించిన ఆర్థిక మాంద్యం.. ప్రతి ద్రవ్యోల్బణానికి మంచి ఉదాహరణలు.
- ప్రతి ద్రవ్యోల్బణం దీర్ఘకాలం కొనసాగితే.. ఆర్థిక విధాన నిర్ణేతలకు ఇబ్బందులే.
- ప్రతి ద్రవ్యోల్బణం నియంత్రణకు ప్రభుత్వాలు తీసుకునే చర్యలు... ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు తీసుకునే చర్యల కంటే భిన్నంగా ఉంటాయి.
- విత్త మార్కెట్‌లోకి ద్రవ్య పంపిణీ.. వడ్డీ రేట్ల తగ్గింపు వంటి చర్యలను ప్రతి ద్రవ్యోల్బణం నియంత్రణకు చేపడతారు.

•ద్రవ్యోల్బణం కంటే.. ప్రతి ద్రవ్యోల్బణమే ఆర్థిక విధాన నిర్ణేతలకు సవాలుగా మారుతోంది. ఈ అభిప్రాయాన్ని యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యూఎన్‌సీటీఏడీ) వ్యక్తం చేసింది.

## ప్రపంచ ఆర్థిక సంక్షోభం:

•ప్రపంచబ్యాంకు అంచనా ప్రకారం–తాజా ఆర్థిక మాంద్యం కారణంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే పరిస్థితి తలెత్తింది.

•1982 తర్వాత తొలిసారిగా 2009లో అంతర్జాతీయ వాణిజ్యం గణనీయంగా పడిపోనుంది.

•అభివృద్ధి చెందుతున్న దేశాలకు పెట్టుబడుల ప్రవాహం 50 శాతం మేర తగ్గనుంది.

•ప్రస్తుత ఆర్థిక మాంద్యం ప్రపంచంలోని అనేక దేశాలను సంక్షోభంలోకి నెట్టనుందని... లక్షల మంది ప్రజలను పేదలుగా మార్చనుందని ప్రపంచ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేసింది.

•2008లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 2.5 శాతం. అది 2009లో 0.9గా నమోదుకానుంది. 1982 తర్వాత ఇదే అత్యంత కనిష్ఠ వృద్ధి రేటు. 1983లో ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు 0.3 శాతం మాత్రమే.

•2009లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థిక వృద్ధి రేటు 4.5 శాతంగా ఉండే అవకాశముంది.

•ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మాంద్యం నుంచి గట్టెక్కించే ఆర్థిక ఇంజిన్ ఏదీ ప్రస్తుతం కనుచూపుమేరలో కనిపించడంలేదు.

•చమురు ధరలు గణనీయంగా పడిపోవడం... చమురు ఎగుమతి దేశాల్లో వినియోగదారుల వ్యయాన్ని తగ్గించింది. అమెరికాలో సైతం వినియోగదారుల వ్యయం దారుణంగా పడిపోయింది.

•ప్రస్తుత మాంద్యం.. 1930 తర్వాత సంభవించిన అత్యంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభమని ప్రపంచ బ్యాంకు చీఫ్ ఎకనమిస్ట్ జస్టిన్ లిన్ అభిప్రాయపడ్డారు.

•ఆర్థిక వ్యవస్థల్లో మందగమనం ప్రభావం తీవ్రతరం కాకుండా నిరోధించేందుకు ప్రపంచ బ్యాంకు ఆయా దేశాలకు ఉద్దీపన ప్యాకేజీలను సిఫార్సు చేసింది.

•గత 20 ఏళ్లల్లో సంపన్న దేశాల మధ్య ఆర్థిక తారతమ్యాలు బాగా పెరిగిపోయాయని.. ఇది సామాజిక గతిశీలతను దెబ్బ తీస్తోందని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్‌కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) తన నివేదికలో వెల్లడించింది.

## సబ్‌ప్రైమ్ లెండింగ్ సమస్య :

ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి మూలకారణం మాత్రం అమెరికాలోని... subprime mortgage crisis అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ దేశంలో 2007లో తలెత్తిన గృహరుణాల చెల్లింపుల సంక్షోభమే.. ఈ సబ్‌ప్రైమ్ లెండింగ్ సమస్య. ఇది విత్త సంస్థలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ఎందు కంటే.. మన దేశంలోలాగా అమెరికా బ్యాంకులకు SLR, CRR నిబంధనలు ఉండవు. ఫలితంగా అమెరికా

బ్యాంకులు ప్రతి ఒక్క డాలరుకు 8 డాలర్ల రుణాలను సృష్టించి ఇచ్చాయి. బ్యాంకుల్లో సంక్షోభం తలెత్తనుందని పుకార్లు వ్యాపించడంతో డిపాజిటర్లు తమ డిపాజిట్లను ఉపసంహరించుకునేందుకు బ్యాంకుల వద్ద క్యూలు కట్టారు. డిపాజిటర్లకు చెల్లింపులు చేసేందుకు బ్యాంకుల వద్ద డబ్బులు లేక పోవడంతో... లేమన్ బ్రదర్స్ వంటి సంస్థలు సైతం చేతులెత్తేసి దివాళా ప్రకటించాయి.

•2008, సెప్టెంబరు 15న ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా ఫైనాన్షియల్ మార్కెట్లలో సెంటిమెంట్ దెబ్బతినడమే ఇందుకు కారణం.

•అమెరికాలో నాలుగో అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్... లేమన్ బ్రదర్స్.. దివాళా ప్రకటించింది. మెరీలించ్... అమెరికాలో మూడో అతిపెద్ద ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్. దాన్ని కూడా బ్యాంక్ ఆఫ్ అమెరికాకు అమ్మేసారు. యూఎస్‌లో అతిపెద్ద బీమా కంపెనీ... అమెరికన్ ఇంటర్నేషనల్ గ్రూప్ (ఏఐజీ).. తీవ్రంగా నష్టాల బారినపడింది. దాంతో అత్యవసర సా యం చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. 85 బిలియన్ డాలర్ల సహాయ ప్యాకేజీని అమెరికా ప్రభుత్వం ఏఐజీ కి ప్రకటించడంతో.. మార్కెట్‌లలో అలజడి కొద్దిగా తగ్గింది.

**అమెరికా బ్యాంకుల దివాళా- కారణాలు:**

•అమెరికాలోని అనేక బ్యాంకులపై ప్రభుత్వ నియంత్రణ పెద్దగా లేదు. తొమ్మిది విభిన్న యంత్రాంగాలు ఫైనాన్షియల్ సెక్టార్‌ను పర్యవేక్షించడం.

•రెగ్యులేటర్ల పర్యవేక్షణకు ఫైనాన్షియల్ ఇన్నోవేషన్స్‌కు మధ్య పొంతన లేకపోవడం.

•ఒకవైపు బ్యాంకుల వద్ద వనరులు తక్కువగా ఉంటే.. మరోవైపు విచ్చలవిడిగా అప్పులు ఇవ్వడం.

•సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడంలో పారదర్శకత లోపించడం.

•ప్రధాన ఫైనాన్షియల్ వ్యవస్థకు సమాంతరంగా.. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు, మోర్టగేజ్ బ్యాంకులు వంటివి పనిచేయడం.

ఫైనాన్షియల్ పత్రాల (ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్స్) అతి వినియోగమే ప్రస్తుత ఆర్థిక సంక్షోభానికి దారితీసిందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) చీఫ్ ఎకనమిస్ట్ రఘురాం రాజన్ అభిప్రాయ పడ్డారు. అధిక రిస్క్‌తో కూడుకున్న ఫైనాన్షియల్ పత్రాలపై బ్యాంకులు ఇబ్బడిముబ్బడిగా పెట్టుబడులు పెట్టాయి. అంతేకాకుండా... వీటి విషయంలో పెద్దగా ముందుజాగ్రత్తలు వంటి చర్యలు కూడా తీసుకోలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లోని బ్యాంకులు పరస్పరం రుణాలిచ్చుకోవడం ఆపేయడంతో ఇంటర్ బ్యాంకింగ్ వ్యవస్థ స్తంభించిపోయింది. ఫలితంగా.. బ్యాంకులు.. కంపెనీలకు, వ్యక్తులు ఇచ్చే రుణాల్లో కోత వేశాయి. ఇది అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలతోపాటు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపనుంది.

**బిలియన్ల డాలర్ల ప్రవాహం:**

•ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయి. ఫైనాన్షియల్ మార్కెట్ల పతనాన్ని

నివారించేందుకే ఈ చర్యలు చేపట్టాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేటులో 50 పాయింట్ల మేర కోతవేసి... వడ్డీరేటును 1.5 శాతానికి తగ్గించింది. యూరప్ సెంట్రల్ బ్యాంకు (ఈసీబీ) కూడా వడ్డీరేటును 4.25 శాతం నుంచి 3.75 శాతానికి తగ్గించింది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ చైనా, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్ బ్యాంకులు కూడా తమ వడ్డీరేట్లలో కోత వేశాయి.

●పరపతి సంక్షోభం నుంచి బయటపడేందుకు ప్రపంచవ్యా ప్తంగా కేంద్ర బ్యాంకులు బిలియన్ల డాలర్లను బ్యాంకుల్లోకి ప్రవహింపచేశాయి.

●బ్యాంకుల్లోకి ద్రవ్యాన్ని ప్రవహింపజేసేందుకు బ్రిటన్ ప్రభుత్వం 50 బిలియన్ల పౌండ్ల ప్యాకేజీని ప్రకటించింది. అదేవిధంగా అమెరికా ప్రభుత్వం కూడా బ్యాంకుల కోసం 700 బిలియన్ డాలర్ల ప్యాకేజీని వెల్లడించింది.

●అయితే, పలు దేశాలు ప్రకటించిన ప్యాకేజీలు, ఇతర చర్యలు... ఫైనాన్షియల్ మార్కెట్లను పునరుత్తేజపరచడంలో సఫలం కాలేకపోయాయి. అమెరికా, జపాన్‌లతోపాటు యూరప్ దేశాలు కూడా ఆర్థిక మాంద్యాన్ని ప్రకటించాయి.

## భారత్‌పై ప్రభావం:

ఐఎంఎఫ్ చీఫ్ ఎకనమిస్ట్ రఘురామ్ రంజన్ అంచనా ప్రకారం.. ఆర్థిక మాంద్యం కారణంగా... భారత్ నుంచి అమెరికాకు ఎగుమతులు తగ్గుతాయి. దాంతో ఎగుమతుల ద్వారా దేశానికి వచ్చే ఆదాయంలో కోతపడుతుంది. భారత ఫైనాన్షియల్ రంగం ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్‌లతో అనుసంధానం చెంది ఉండటంవల్ల... ఆ మేరకు దేశ ఫైనాన్షియల్ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం పడుతుంది!!

## స్వేచ్ఛామార్కెట్ వ్యవస్థకు ముగింపేనా...?

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఫైనాన్షియల్ మార్కెట్‌లలో నెలకొన్న సంక్షోభం... పెట్టుబడి దారీ వ్యవస్థ (క్యాపిటలిజం)లో సమస్యను కాకుండా పెట్టుబడిదారుల అజాగ్రత్తలను బహిర్గతం చేసేదిగా ఉందని రఘురాం రాజన్ అభిప్రాయపడ్డారు. కార్ల్‌మార్క్స్ మొదలుకొని అనేకమంది క్యాపిటలిస్టు ఆర్థిక వేత్తలు సూత్రీకరించినట్లు... ప్రస్తుత సంక్షోభం.. స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థల్లో సంభవించే సైకిల్ (cycle) లో భాగమే. ఇది స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థకు ముగింపు ఎంత మాత్రం కాదు అని రాజన్ పేర్కొన్నారు. కొన్ని లోపాలున్నప్ప టికీ.. క్యాపిటలిజమే ఉత్తమ అభివృద్ధి మోడల్ అన్నారు.

ఫైనాన్షియల్ మార్కెట్స్‌లో సంక్షోభాలు తరచూ పునరావృతం కాకుండా... ప్రపంచ ఫైనాన్షియల్ వ్యవస్థలో సమూల సంస్కరణలు తేవాలని ఐక్య రాజ్య సమితికి చెందిన ఆర్థిక వేత్తలు పిలుపు నిచ్చారు. అభివృద్ధి చెందుతున్న దేశాలను కలుపుకొనిపోయేలా... ఆయాదేశాల విధాన నిర్ణయాల్లో సమన్వయం సాధించేలా.. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)ల పనితీరును సమీక్షిం చాల్సిన అవసరముందని సిఫార్సు చేశారు. ప్రస్తుత సంక్షోభానికి దారి తీసిన పరిస్థితులు పునరావృతం

కాకుండా.. ఫైనాన్షియల్ వ్యవస్థలో మౌలిక సంస్కరణలు ప్రవేశపెట్టాలి. పూర్తిగా అమెరికన్ డాలర్‌పై ఆధారపడకుండా... బహుళ కరెన్సీ వ్యవస్థ దిశగా ప్రస్తుత అంతర్జాతీయ రిజర్వ్ వ్యవస్థను సంస్కరించాలి. ప్రస్తుత ఆర్థికమాంద్యాన్ని ఎదుర్కొంటూ.. ఆర్థిక ప్రగతే లక్ష్యంగా.. దేశాల మధ్య సమన్వయంతో ప్రపంచ ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించాలి.

SAKSHI